విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, బుధవారం 19, మార్చి 2025

విద్యుత్ మీటర్ రీడర్ల సమస్యలు పరిష్కరించండి

విశాలాంధ్ర-డోన్ : ఆంధ్రప్రదేశ్ విద్యుత్ మీటర్ రీడర్స్ సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి.సుంకయ్య అన్నారు. మంగళవారం డోన్ విద్యుత్ కార్యాలయం దగ్గర విద్యుత్ మీటర్ రీడర్స్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా చేయడం జరిగింది. ఈ ధర్నాకు ఏఐటియుసి డోన్ కార్యదర్శి అబ్బాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సుంకయ్య మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్ మీటర్స్ ఏర్పాటు చేయడం వలన మీటర్ రీడర్స్ కార్మికులు ఉపాధి కోల్పోతారని కాబట్టి తిరుపతి డిఎండి నుంచి వచ్చిన జీవో ప్రకారం తమను విద్యుత్ సంస్థల్లో ఉద్యోగాలు కల్పించి తమ కుటుంబాలను ఆదుకోవాలన్నారు.సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి ,పని భద్రత కల్పించాలి అని అన్నారు స్మార్ట్ మీటర్స్ ఏర్పాటు చేయడం వల్ల ఆదానీ అంబానీలకు కోట్లాది రూపాయలు ఆదాయం వస్తుంది తప్ప... విద్యుత్ మీటర్ రీడర్స్‌కు ఉద్యోగ భద్రత కోల్పోతారన్నారు.అనేక సంవత్సరాల నుండి ఇదే పనిని నమ్ముకొని ఉపాధిగా ఉద్యోగంగా భావిస్తూ కష్టపడి పని చేస్తున్నారని వారిని వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర మంత్రివర్యులు నారా లోకేష్ యువగలం పాదయాత్ర సమయంలో స్మార్ట్ మీటర్స్ గ్రామాల్లో రైతుల మోటార్స్ కు ఇంళ్లకు ఏర్పాటు చేస్తే స్మార్ట్ మీటర్ను రోడ్డుమీద పడేయండి అని అందుకు నేను అండగా ఉంటానని హామీ ఇచ్చి...నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత స్మార్ట్ మీటర్లు ఏర్పాటుకు సన్నాహాలు చేయడం మాట తప్పడం కాదా మోసం చేయడం కాదా సమాధానం చెప్పాలన్నారు. పెరిగిన ధరలు కనుగుణంగా విద్యుత్ మీటర్ రీడర్స్ కు వేతనాలు పెంచాలని వారి కుటుంబాలను ఆదుకోవాలని అనేక డిమాండ్స్ ప్రభుత్వం దృష్టికి వినతి ద్వారా తెలపామని వాటిని పరిష్కారం చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం వినతిపత్రాన్ని డిఈకి అందజేశారు.విద్యుత్ మీటర్ రీడర్స్ సబ్ డివిజన్ నాయకులు గోపికృష్ణ, నరేష్,రవికుమార్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల రూరల్ : సోమవారం రాష్ట్ర సమితి పిలుపుమేరకు ఏఐటియుసి ఆధ్వర్యంలో నంద్యాల విద్యుత్ శాఖ కార్యాలయం నందు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని విద్యుత్ డిఈ శ్రీనివాసులుకు సమర్పించారు. ఈ కార్యక్రమంలోవిద్యుత్ రీడర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, ఉమ్మడి జిల్లాల కార్యదర్శి దస్తగిరి, కోయిలకుంట్ల మీటర్ మీటర్స్ రీడర్ సబ్ డివిజన్ అధ్యక్షుడు పటాన్ ఖాజా హుస్సేన్,

ఒంటి పూట బడులు నిర్వహించాలి

విశాలాంధ్ర - నందికొట్కూరు : వేసవి కాలపు దృష్ట్యా రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి అంగన్వాడి స్కూల్ విద్యార్థులకు ఒంటి పూట బడులు నిర్వహించాలని ఏఐటియుసి జిల్లా నాయకులు రఘురాం మూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం నందు సిడిపిఓ కోటేశ్వరమ్మ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 55 వేల 607 అంగన్వాడి కేంద్రాల యందు చిన్నారులు వేలాదిమంది విద్యను అభ్యసిస్తున్నారన్నారు. అయితే ప్రస్తుతం మార్చి నెలలో ఎండలు తీవ్రం కావడంతో చిన్నారులు అవస్థలకు గురై రోగాల బారిన పడడం జరుగుతుందన్నారు. అంగన్వాడి కేంద్రాలకు వెళ్తున్న చిన్నారులు ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు స్కూల్ కొనసాగుతుందని, రాష్ట్ర ప్రభుత్వం

అన్ని ప్రభుత్వ ప్రైవేటు స్కూళ్లకు ఈ నెల మార్చి 15 నుంచి ఏప్రిల్ 21వరకు ఉదయం 7:45 నిమిషాల నుంచి మధ్యాహ్నం 12:30 నిమిషాల వరకు ఒంటిపూట బడులు నిర్వహించడం జరుగుతుందని వీటితోపాటు రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడి చిన్నారులకు కూడా ఒంటిపూట బడులు నిర్వహించి చిన్నారుల ఆరోగ్యాలను కాపాడాలని కోరారు.

ప్రమాదానికి దగ్గరి దారి..

విశాలాంధ్ర - చాగలమర్రి : చాగలమర్రి మండలం జ్ఞానాపురం గ్రామం నుంచి పెద్దవంగలి గ్రామానికి వెళ్లే పొలాల రహదారిలో ఓ మలుపు వద్ద ప్రమాదకరంగా బావి ఉంది. గ్రామం నుంచి పెద్దవంగలి వరకు తెలుగుగంగ పంట కాలువ వెంట మట్టి రహదారి పై చాగల మర్రి పట్టణానికి ద్విచక్రవాహనాల్లో ప్రజలు వస్తుంటారు. జ్ఞానాపురం సమీపంలో మలుపు వద్ద ప్రమాద సూచికలు లేకుండా ప్రమాదకరంగా బావి ఉంది. అజాగ్రత్తగా వచ్చినా వాహనాలు నేరుగా బావిలో పడే ప్రమాదముంది. చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

రీ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

విశాలాంధ్ర - డోన్ రూరల్ : ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన భూ రీ సర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని తహశీల్దార్ నాగమణి అన్నారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం నాగమణి మాట్లాడుతూ గ్రామాలలో భూ సర్వే చేసే సమయంలో అనుమానాలు తలెత్తితే సంబంధితపై అధికారుల సూచనలు తీసుకోవాలని తెలిపారు. కొన్ని గ్రామాలలో భూ సర్వే కార్యక్రమాన్ని జయప్రదంగా పూర్తి చేయడం జరిగిందని మరికొన్ని గ్రామాలలో రీసర్వే చేపట్టడం జరిగిందని ఆమె తెలిపారు. రీ సర్వే చేసే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వీఆర్వోలకు, విలేజ్ సర్వేయర్లకు పలు అంశాలను సూచించిచారు. డిప్యూటీ తశీల్దార్ సునీల్ కుమార్, మండల సర్వేయర్ జగదీష్, వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

విశాలాంధ్ర - నంద్యాల రూరల్ : మద్యపానం మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి కృష్ణమూర్తి, రాముడులు తెలిపారు. మంగళవారం ప్రభుత్వ వైద్యశాల నందు "మత్తు పదార్థాలు - విమోచన" అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా ప్రొవిబి షన్, ఎక్సైజ్ అధికారి రవికుమార్ ఆదేశాల మేరకు సదస్సు నిర్వహించినట్లు వారన్నారు. ప్రధానంగా నేటి యువత మద్యపానము మత్తు పదార్థాలపై అలవాటు పడి తమ ఆరోగ్యాలను పాడు చేసుకుంటారన్నారు. చిన్ననాటి నుండే కొందరు తల్లిదండ్రులు లేకపోవడం వల్ల అలాగే చెప్పేవారు ఎవరు లేక మత్తు పదార్థాలకు అలవాటు పడి అనారోగ్యం పాలు అవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా యువకులు మత్తు పదార్థాలకు బానిస కాకుండా దేశ భవిష్యత్ కొరకు ఆలోచించాలని వారు కోరారు. అవగాహన సదస్సు కార్యక్రమంలో డాక్టర్స్, సిబ్బంది యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉచిత కుటు మిషన్ శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

విశాలాంధ్ర - జూపాడుబంగ్లా : మండలంలోని ఆయా గ్రామాల్లోని మహిళలు స్కిల్ టైలరింగ్ సెంటర్ ద్వారా ఉచిత టైలరింగ్ శిక్షణ పొందేందుకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎంపీడీవో గోపికృష్ణ తెలిపారు. మంగళవారం మండల అభివృద్ధి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సందర్భంగా ఎంపీడీవో గోపికృష్ణ మాట్లాడుతూ మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని ఆయన తెలిపారు. ఈ కుట్టు శిక్షణకు 18 నుంచి 50 ఏళ్లలోపు వయస్సు కలిగిన మహిళలు అర్హులని ఆయన తెలిపారు. ఆసక్తి కలిగిన మహిళలు ఆయా గ్రామాలలోని గ్రామ సచివాలయాల వదకు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, మొబైల్ నెంబర్,తీసుకుని వెళ్లి వారి పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఆసక్తి కలిగిన మహిళలు వెంటనే ఈఅవకాశాన్ని సద్వినియోగంచేసుకోవాలని ఆయన తెలిపారు.

విశ్వకర్మ యోజన లబ్ధిదారులకు శిక్షణ



విశాలాంధ్ర - బనగానపల్లె : బనగానపల్లె భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో విశ్వకర్మ యోజన కింద లబ్ధిదారులకు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. మంగళవారం బనగానపల్లె భారతీయ జనతా పార్టీ అసెంబ్లీ కన్వీనర్ బివి సుబ్బారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ మండల అధ్యక్షుడు యాదగిరి, రూరల్ మండల అధ్యక్షుడు హరికృష్ణ గౌడ్, జిల్లా మాజీ ఎస్సీ మోక్ష అధ్యక్షుడు తప్పెట ప్రసాద్, ఉప్పరి వెంకట నారాయణ ,బనగానపల్లె మండల ప్రధాన కార్యదర్శి శ్రీరాములు కిషోర్, మోక్ష జిల్లా ఉపాధ్యక్షులు శివరామిరెడ్డి, బిజీగాల్ల లింగన్న,లబ్ధిదారులు మహిళలు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్‌లను పరిశీలించిన కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా ఈవీఎం గోడౌన్లను జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పర్యవేక్షించారు. మంగళవారం టేక్కే మార్కెట్ యార్డ్‌లోని ఈవీఎంలను భద్రపరిచిన గోడౌన్లను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్ పరిశీలించారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోడౌన్లకు వేసిన సీళ్లను, ఈవీఎంల రక్షణ, భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పర్యవేక్షణ రిజిష్టర్‌లో జిల్లా కలెక్టర్ సంతకం చేశారు. ఈవీఎంల గోదాం వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పలు సూచనలు జారీ చేశారు. డిఆర్ఓ రామునాయక్, ఆర్డీఓ విశ్వనాథ్,

నంద్యాల తాసిల్దార్ ప్రియదర్శిని, ఎన్నికల విభాగపు తాసిల్దార్ జయప్రసాద్, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులైన కాంగ్రెస్ తరపున సయ్యద్ రియాజ్ బాషా, వైయస్సార్సీపి తరపున సాయిరాం రెడ్డి, టిడిపి తరపున శివరామిరెడ్డి, బిజెపి తరపున కసెట్టి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక బహిరంగ సభ

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట 2023-24 ఆర్థిక సంవత్సరంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద చేపట్టిన పనులపై బహిరంగ సభను మంగళవారం నిర్వహించారు. డిస్టిక్ విజిలెన్స్ అధికారిని శోభారాణి, ప్రొసీడింగ్ ఆఫీసర్ బాలాజీ నాయక్, ఈపిడి సాంబశివరావు, ఇన్చార్జి ఏపిఓ రాజబాబు ఆధ్వర్యంలో ప్రజా వేదిక సభను చేపట్టారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో మండల వ్యాప్తంగా 675 పనులకు గాను రూ.6,30,95,622 కోట్ల ఖర్చు చేయగా ఇందులో కూలీల వేతనాల చెల్లింపుల కోసం రూ.5,50,52,968, మెటీరియల్‌కు రూ.53,42,654 ఖర్చు చేశారు. ఎస్ఆర్పి కాంతారావు ఆధ్వర్యంలో ఆయా గ్రామా

లలో సోషల్ ఆడిట్ బృందం తనిఖీలు పరిశీలన చేసి తమ నివేదికను గ్రామాల వారీగా సభలో వినిపించారు. ఇందులో రూ.1,35,694 రికవరి, రూ.14,100 పెనాల్టీని అధికారులు విధించారు. సామాజిక బహిరంగ సభ ప్రశాంతంగా ముగిసింది. సభలో ఆయా గ్రామాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లు, కూలీలు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు పని భారం తగ్గించాలి

విశాలాంధ్ర-అవుకు : పంచాయతీ కార్యదర్శులకు పనిభారం తగ్గించాలి అని అవుకు మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు కే శ్రీనివాసులు అన్నారు. పని ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగించాలి అని మండల అభివృద్ధి అధికారి వెంగన్నకు పంచాయతీ కార్యదర్శుల సంఘం గౌరవ అధ్యక్షుడు హరిప్రసాద్, గౌరవ సలహాదారులు ప్రభాకర్, సంఘం మండల అధ్యక్షులు కే శ్రీనివాసులు ఆధ్వర్యంలో మంగళవారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు వివిధ రకాల సర్వేలు మరియు ప్రభుత్వం నిర్దేశిత కార్యక్రమాలను అమలు పరుస్తూ సెలవు దినాలు పండుగ దినాలలో కూడా విధులలో పాల్గొంటూ తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని అన్నారు. వివిధ ప్రభుత్వ పథకాల అమలు సచివాలయ సిబ్బందితో సమన్వయం అధికారుల పర్యటనలతో అధిక పని భారంతో ఒత్తిడికి గురవుతున్నారని అన్నారు. కావున ప్రభుత్వము పంచాయతీ కార్యదర్శులపై పడుతున్న అధిక పని భారం నుండి ఉపశమనం కలిగించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు హరి ప్రసాద్ రెడ్డి, మదన సుధాకర్, సుబ్బరాయుడు, వెంకటేష్, చక్రపాణి, భాస్కర్, నాగలక్ష్మి, దినేష్, విజయ కుమారి, మనోజ్ ,రాజేష్, భీముడు నాయక్, మదన గోపాల్ ,సురేష్ నాయక్, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

ఖోఖో అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు నియామకం

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్ :పట్టణంలో ఖోఖో అసోసియేషన్ ఏర్పాటు చేసినట్లు ఆత్మకూరు ఖోఖో అసోసియేషన్ అధ్యక్షులు మహేబూబ్ తెలిపారు. ఈ సందర్భంగా ఖోఖో అసోసియేషన్ గౌరవ అధ్యక్షులుగా టైగర్ బాబును ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మహేబూబ్ ఉపాధ్యక్షులుగా ప్రసాద్ కార్యదర్శిగా బాషా కోశాధికారిగా సతీష్ ను ఎన్నుకున్నారు. ఖోఖో శిక్షణ తీసుకొనే ప్రతి విద్యార్థికి ఉచితంగా శిక్షణ ఇస్తున్నామన్నారు. క్రీడాకారుల శిక్షణ నిమిత్తం శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి సహకారంతో ఉచిత శిక్షణ తీసుకొనే వారికి హాస్టల్ వసతి కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా, ఆత్మకూర్ స్పోర్ట్స్ క్లబ్ సలహాదారులు మోమిన్.మునీర్ బాషా, తైక్వాండో గౌరవ అధ్యక్షులు నాయబ్.సయ్యద్ అసదుల్లా, సామాన్న, కరిముల్లా, బాల్ బ్యాట్మింటన్ క్రీడాకారులు పాల్గొన్నారు.

బాధితురాలికి ఇన్సూరెన్స్ చెక్కు పంపిణీ

విశాలాంధ్ర - వెలుగోడు : వెలుగోడు మండలం తిమ్మనపల్లె గ్రామానికి చెందిన జింకల.వెంకటేశ్వర్లు చనిపోవడంతో బాధితురాలు భార్యకు ఇన్సూరెన్స్ ఆంధ్ర ప్రగతి బ్యాంక్ మేనేజర్ అబ్దుల్ కరీం మంగళవారం అందజేశారు. పియం జె జె బి వై ఇన్సూరెన్స్ 436 రూపాయలు ప్రీమియం కట్టినందువలన ఆయన నామిని అయిన భార్య రమాదేవి అకౌంట్‌కు 2లక్షల ఇన్సూరెన్స్ అమౌంట్ జమ కావడం జరిగింది. ఈ అమౌంట్ ను వారు కుటుంబ అభివృద్ధికి ఉపయోగించుకోవాలని చెప్పడం జరిగింది.అర్హత గల వారు అందరూ పి యం జె జె బి వై, పి యం యస్ బి వై ఇన్సూరెన్స్ చేయించు కోవాలి అని మేనేజరు తెలియజేయడం జరిగింది. ఈ ఇన్సూరెన్స్ అమౌంట్ ను నా కూతురు,కొడుకు చదువుల కొరకు ఉపయోగించుకుంటానని బాధితురాలు చెప్పడం జరిగింది. ఇన్సూరెన్స్ అమౌంట్ తెప్పించిన బ్యాంక్ మేనేజర్ అబ్దుల్ కరీం కృతజ్ఞతలు తెలిపారు.

టీడీపీ నాయకుడుని పరామర్శించిన భూమా

విశాలాంధ్ర - రుద్రవరం : మండల కేంద్రంలోని గ్రామీణ వైద్యుడు గురుస్వామి ఆరోగ్య రీత్యా గుండె ఆపరేషన్ చేయించుకున్నారని విషయం తెలుసుకున్న ఆళ్లగడ్డ టిడిపి యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి పరామర్శించారు . మంగళవారం మండల కేంద్రంలోని గురు స్వామి ఇంటి దగ్గరకు వెళ్లి ఆయన ఆరోగ్య స్థితిగతులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యపరంగా అన్ని విధాలుగా తమవంతుగా సహాయ సహకారాలను తప్పకుండా అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న పోల్దాసు చిన్న కొండయ్యను పరామర్శించారు. ఆయన వెంట స్థానిక టిడిపి నాయకులు రంగనాయకులు, సీనియర్ నాయకుడు గురుమూర్తి, పలువురు టిడిపి నాయకులు ఉన్నారు.

అన్న క్యాంటీన్‌ను పరిశీలించిన కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నిరుపేదల ఆకలి తీర్చి పేద ప్రజలకు అండగా వుండే అన్నా క్యాంటీన్‌ను జిల్లా కలెక్టర్ పర్యవేక్షించారు. మంగళవారం నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాల సముదాయంలో నున్న అన్నా క్యాంటీన్‌ను జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ఆహార పదార్థాలు ఇస్తున్నారా లేదా, ఉదయం అల్పాహారానికి ఎంత మంది వస్తున్నారు, మధ్యాహ్న, రాత్రి భోజనాలకు ఎంతమంది పేదలు వస్తున్నారన్న విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అన్నా క్యాంటీన్లలో రోజువారీగా నిర్దేశించిన మెనూ ప్రకారం ఆహార పదార్థాలను ఇవ్వాలని కలెక్టర్ సిబ్బందిని ఆదేశించారు. అన్నా క్యాంటీన్ పరిసర ప్రాంతాలను కలెక్టర్ పరిశీలిస్తూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఒక్కొక్కరి నుంచి పూటకు ఐదు రూపాయలు చొప్పున నామ మాత్రపు ధరను వసూలు చేసి ఆహార పదార్థాలను ఇస్తున్నామని సిబ్బంది కలెక్టర్ కు నివేదించారు.

అధునాతన స్కానర్లు మంజూరు : ఎంపీడీవో

విశాలాంధ్ర - శిరివెళ్ల : మండల పరిధిలోని ఆయా గ్రామ వార్డు సచివాలయలకు అధునాతన టెక్నాలజీతో కూడిన స్కానర్లు మంజూరు అయినట్లు ఎంపీడీవో సి శివమల్లేశ్వరప్ప పేర్కొన్నారు ప్రభుత్వం నిర్దేశించిన పలు సర్వేలు పెన్షన్ల పంపిణీ వంటి కార్యక్రమాలు వేగవంతంగా నిర్వహించేందుకుగాను బోయలకుంట సచివాలయంకు 10చెన్నూరుకు 10 గంగవరంకు 6 గుండం పాడుకు 7గుంప్రమానుదిన్నేకు 10జినేపల్లెకు 7కోటపాడుకు 10 మహాదేవపురంకు 9శిరివెళ్ల -1కు 8శిరివెళ్ల -2కు 6శిరివెళ్ల 3,7శిరివెళ్ల -4,8 యర్రగుంట్ల -1 9 యార్రగుంట్ల-2 కు 10 గోవిందపల్లె -1 కు 10, గోవింద పల్లె సచివాలయం 2 కు 9 మొత్తం 136 ప్రభుత్వం నుండి మంజూరు కాగా ఆయా గ్రామ వార్డు సచివాలయ కార్యదర్శులకు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో సిసి మల్లేశ్వరప్ప పేర్కొన్నారు. విధి నిర్వహణలో నిర్వహించే సర్వేలు,ప్రభుత్వ కార్యక్రమాల అమలులో ఈ నూతన టెక్నాలజీ గల స్కానర్లు ఉన్నట్లు తెలిపారు.

సస్యరక్షణ చర్యలపై అవగాహన

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్ : మండలంలోని కురుకుంద మరియు కొట్టాల చెరువు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి ,డి.ఆర్.సి ఏవో హేమలత మాట్లాడుతూ వివిధ పంటలలో సస్యరక్షణ చర్యలను గురించి రైతులకు వివరిం చారు. గ్రామాల్లోని రైతులు రైతు సేవ కేంద్రం వద్దకు వెళ్లి ఫార్మర్ రిజిస్ట్రీ నందు రిజిస్ట్రేషన్ చేయించుకొని ఐడి నెంబర్ పొందవలసినదిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవడం వలన రైతులకు పిఎం కిసాన్ మరియు అన్నదాత సుఖీభవ ,ఎరువులు సబ్సిడీ మొదలైన లాభాలు పొందవచ్చునని తెలియజేశారు.రైతులు తప్పని సరిగా భూసార పరీక్ష చేయించుకొని ఉదజని సూచిక ఆధారంగా పంటల ఎంపిక చేసుకోవాలని. పంట మార్పిడి యొక్క ఉపయోగాలను రైతులకు తెలిపారు. పంట విత్తె సమయం మరియు రకాల ఎంపిక యాజమాన్య పద్ధతిల పైన దిగుబడి ఆధారపడి ఉంటుందని రైతులకు తెలియజేసారు. సేంద్రీయ మరియు పచ్చిరొట్ట ఎరువులు వాడటం వలన భూసారం పెంచవచ్చునని. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జీవామృతం తయారీని రైతులకు డెమో చూపించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పట్టు పరిశ్రమ అధికారిని అరుణ ,వ్యవసాయ విస్తరణ అధికారి , రైతు సేవ కేంద్ర సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మరియు రైతులు పాల్గొనడం జరిగింది.

సర్వేలు వేగవంతం చేయండి

విశాలాంధ్ర - చాగలమర్రి : పూర్తి పేదరిక నిర్మూలనే లక్ష్యంగా గ్రామాలలో, వార్డు సచివాలయ సిబ్బందిచేపట్టిన పి4 సర్వే ప్రక్రియ వేగవంతం చేయాలని డిఎల్‌డీఓ,గ్రామ,వార్డు సచివాలయాల జిల్లా అధికారి శివారెడ్డి కోరారు. మంగళవారం చాగలమర్రి పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో చాగలమర్రి పట్టణంలోని సచివాలయాల వివిధసర్వేలకు సంబంధించిన ప్రగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి4,వర్క్ ఫ్రమ్‌హోమ్,మిస్సింగ్ సిటిజన్ సర్వేలను,చిన్నారుల ఆధార్‌ల ఈకేవైసి సర్వేలను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ సర్వేలలో ఏమైన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, ఈఓపిఆర్‌డి తాహీర్‌హుసేన్, పంచాయతి కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

వడదెబ్బతో మహిళ మృతి

విశాలాంధ్ర-అవుకు : మండలంలోని ఓబులాపురం గ్రామంలో వడదెబ్బతో మహిళ మృతి చెందిన సంఘటన మంగళవారంచోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు ఓబులాపురం గ్రామానికి చెందిన పోలక లక్ష్మీదేవి (75) వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేది. మంగళవారం ఉదయము గ్రామంలోని మిరప పంట కూలి పనికి వెళ్ళింది. మిరప పంట కోస్తుండగా మధ్యలో స్పృహ తప్పి పడిపోవడంతో సహచర కూలీలు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న కుటుంబ సభ్యులు 108 కు సమాచారం ఇచ్చారు. సంఘటనస్థలానికి చేరుకున్న 108 సిబ్బంది పోలక లక్ష్మీదేవిని పరీక్షించి అప్పటికే మృతి చెందిందని తెలిపారు. మృతురాలి భర్త సంజీవ రాయుడు ఐదు సంవత్సరాల క్రితం మృతి చెందగా ఇద్దరు కుమారులు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోలక లక్ష్మీదేవి వడదెబ్బతో మృతి చెందిన విషయాన్ని స్థానిక తహసిల్దార్ మల్లికార్జున్ రెడ్డికి సమాచారాన్ని అందించాం అనికుటుంబసభ్యులు తెలిపారు.

మామిడి సాగులో అధిక దిగుబడులకు యాజమాన్య పద్ధతులు తప్పనిసరి

విశాలాంధ్ర - రుద్రవరం : మామిడి తోటల పెంపకంపై రైతులు యాజమాన్య పద్ధతులు తప్పని సరిగా పాటిస్తే అధిక దిగుబడులను మహానంది ఉద్యాన శాఖ పరిశోధన శాస్త్రవేత్త దీప్తి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బెస్త కాలనీలో మామిడి తోటలను సాగు చేస్తున్న అధిక దిగుబడుల సాధింపు పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మామిడి తోటల సాగు ఉత్పత్తిలో మన రాష్ట్రం దేశంలోనే రెండో స్థానంలో ఉందని, పండ్ల తోటలలో సుమారు 68 శాతం విస్తీర్ణం మేర మామిడి తోటలే సాగు చేస్తున్నారని అన్నారు. కాయల పెరుగుదల దశలో వచ్చే అకాల వర్షాల వలన చీడపీడల ఉధృతి ఎక్కువ కావడంతో కాయలు వాణిజ్యపరంగా నాణ్యత విలువలను కోల్పోతున్నాయని తెలిపారు. మామిడి సాగులో దిగుబడి క్షీణించడానికి మామిడి చెట్లు పెద్దవిగా ఉండి ప్రతి సంవత్సరం కొమ్మలు కత్తిరింపు చేయకపోవడం, చెట్లు వయసు పైబడి క్షీణ దశలో ఉండడం, చెట్లకు సరైన పోషకాలు తగు పాళ్లలో రైతులు అందించకపోవడం, కేవలం రసాయనిక ఎరువులను వాడడం, సూక్ష్మ పోషకాలు లోపించడం, సరైన నీటి యాజమాన్య పద్ధతులు పాటించకపోవడం, మందులను సకాలంలో వినియోగించకపోవడం లాంటి కారణాలవల్ల చీడపీడల ఉధృతి ఎక్కువై పంట నష్టం జరగడమే కాకుండా కాయ ,నాణ్యత క్షీణిస్తుందని తెలిపారు. ఆళ్లగడ్డ తాలూకా ఉద్యానవన శాఖ అధికారి శ్రీధర్, హార్టికల్చర్ అసిస్టెంట్ ఫణీంద్ర, ఉపాధి హామీ ఈసి సుబ్బన్న, మామిడి సాగు చేసిన రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ : ఎంపీడీవో

విశాలాంధ్ర - వెలుగోడు : మండలంలోని మోత్కూరు గ్రామం, వెలుగోడు సచివాలయం 1, గ్రామ పంచాయతీ కార్యాలయం లను ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి తనిఖీ చేశారు. పీజిఆర్ఎస్ ఫీడ్బ్యాక్ మరియు వర్క్ ఫ్రం హెూం సర్వే, ఇతర సర్వేలను కంప్లీట్ చేయవలసిందిగా సచివాలయం సిబ్బందిని ఆదేశించారు.

E-Procurement Tender Notice

Dhone Municipality, R.S Road, Dhone,
Telephone No 08516-223281,
e-mail id: mc.dhone@cdma.gov.in

E-Tender :
Tender Notification No:- 09,11,16 and 20/2024-25/General Funds/E1. 01,02/ASC/2025/E1, and 05 No's Box Tender Dt.18/03/2025 of Dhone Municipality.

Name of the Grant	General Funds 2024-25. ASC Grants 2024-2025
No. of works	03 No's 6th Call 02 No's 2nd Call 01 No' 1st Call (Hiring of Car 4-wheeler) 05 No's Box Tender
Last date and time of receipt of Tenders and sealed quotations	02.04.2025 Time : 04:30P.M 25.03.2025 Time : 04:30P.M

E-Tender Website : https://tender apeprocurement.gov.in
E-Mail ID for Clarifications/Communication mc.dhone@cdma.gov.in
Note: Any addendum / Corrigendum / bid clarifications/ time extension shall be issued on the website only. No separate press notification shall be issued. contact : No's : 9949588370 & 9949588372.

sd/-(s.prasad goud)
commissioner,
dhone municipality.

అక్రమ వసూళ్లను అరికట్టాలి : ఏపీ మహిళా సమాఖ్య

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: నగరంతోపాటు జిల్లా వ్యాప్తంగా గ్యాస్ ఏజెన్సీల గ్యాస్ సిలిండర్ డెలివరీకి అక్రమంగా డబ్బుల వసుళ్ళకు పాల్పడుతున్నారని, ఇలాంటి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఏపీ మహిళా సమాఖ్య నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో డీఎస్ఓ కార్యాలయ సూపరింటెండెంట్ శివరంజనికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గిడ్డమ్మ, శ్రావణి, మునెమ్మలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిడ్డమ్మ, శ్రావణిలు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా గ్యాస్ ఏజెన్సీలు వాటి యాజ మాన్యాలు వినియోగదారులకి ఉచితంగా గ్యాస్ సిలిండర్ డోర్ డెలివరీ చేయాలని ప్రభుత్వ నిబంధనలో ఉన్నప్పటికీ గ్యాస్ డెలివరీ బాయ్స్ వినియోగదారుల దగ్గర రూ.50 నుండి వంద రూపాయల వరకు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. సిలిండర్ తీసుకొని వచ్చిన వారితో అదనంగా ఎందుకు డబ్బులు చెల్లించాలని ప్రశ్నిస్తే గ్యాస్ ఏజెన్సీలు మాకు ఎలాంటి జీతాలు ఇవ్వడం లేదు మీరిచ్చే వాటితో మాకు జీతాలని చెబుతున్నారన్నారు. గ్యాస్ ఏజెన్సీల పైన చట్ట ప్రకారం చర్యలు తీసుకొని వినియోగదారులకి ప్రభుత్వం నిర్ణయించిన ధరకే నాణ్యమైన గ్యాస్ సిలిండర్ అందేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రమాదాలు జరక్కుండా పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - బ్యూరో కర్నూలు: రహదారుల్లో ప్రమాదాలు జరగకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో డిస్ట్రిక్ట్ రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్ పాటించకపోవడం, వాహనాలను ఓవర్ టేక్ చేయడం, హెల్మెట్ ధరించకపోవడం వంటి కారణాలతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, రహదారి నియమాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని, వాహన దారులు హెల్మెట్ ధరించేలా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ముందుగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల పరిసరాల్లో తప్పనిసరిగా హెల్మెట్ వాడేలా నో హెల్మెట్ - నో ఎంట్రీ అనే బ్యానర్‌లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎల్లమ్మ తల్లి గుడి దగ్గర బ్రిడ్జి వర్క్ పూర్తి చేశారని, బ్రిడ్జి అప్రోచ్ రోడ్డుకు సంబంధించి నేషనల్ హైవే అధికారులతో సమీక్ష నిర్వహించుకుని త్వరితగతిన భూసేకరణను పూర్తి చేయాలని కలెక్టర్ కర్నూలు ఆర్డీఓను ఆదేశించారు. కిడ్స్ వరల్డ్ నుండి రాజ్ విహార్ సర్కిల్ వరకు ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను వచ్చే సమావేశం నాటికి సమర్పించాలని కలెక్టర్ కర్నూలు నగర పాలక సంస్థ అదనపు కమిషనర్‌ను ఆదేశించారు. పెద్దపాడు నుండి హైదరాబాద్ ఎన్‌హెచ్‌కు లింక్ చేస్తూ ఔటర్ రింగ్ రోడ్ ఏర్పాటుకు సంబంధించి ఎన్‌హెచ్, ఆర్ అండ్ బీ, మున్సిపల్ శాఖల అధికారులు జాయింట్ ఇన్స్పెక్షన్ చేసి నివేదిక అందచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాల బయట ట్రాఫిక్ రద్దీ తగ్గించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌ను ఆదేశించారు. నగరంలో 156 సీసీ కెమెరాలకు గాను 135 కెమెరాలను ఇన్స్టాల్ చేశారని, మరో 21 సీసీ కెమెరా లకు సంబంధించిన లొకేషన్ లలో కూడా ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మున్సిపల్ అదనపు కమిషనర్‌ను ఆదేశించారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ ప్రజలు హెల్మెట్ ను ఉపయోగించేలా అవగాహన కల్పించడంలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల్లో, పెట్రోల్ షాపులలో నో హెల్మెట్ - నో ఎంట్రీ అని బ్యానర్‌లను ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల నుండి హైవేకి కనెక్ట్ అయ్యే అప్రోచ్ రోడ్ల వద్ద స్పీడ్ బ్రేకర్‌లు ఎక్కడ ఏర్పాటు చేయాలనే వివరాలు ఇచ్చామని, ఆ మేరకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

నేడు టిడ్కో గృహాలు సందర్శించనున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి

విశాలాంధ్ర - బ్యూరో కర్నూలు: నగర శివారులో గత ప్రభుత్వం నిర్మించిన టిడ్కో గృహాలను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ బుధవారం సందర్శించనున్నారు. 2014 ఎన్నికల్లో విజయం సాధించిన టీడీపీ ప్రభుత్వం జిల్లాలో 10 వేల టిడ్కో గృహాలు నిర్మించింది. 2019 ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో పంపిణీ చెయ్యలేక పోయారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం టిడ్కో గృహాలు పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేసింది. సీపీఐ ఆధ్వర్యంలో పలు మార్లు ఆందోళనలు చేసినా ప్రభుత్వం పట్టించు కోలేదు. తిరిగి అధికారంలోకి టీడీపీ ప్రభుత్వం రావడంతో టిడ్కో గృహాలు లబ్ధిదారులకు పంపిణీకి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు మరోసారి సందర్శించి, ఆందోళనకు సిద్ధం కానున్నారు.

విజిబుల్ పోలీసింగ్‌తో భద్రతకు భరోసా

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : విజిబుల్ పోలీసింగ్ ను మరింత బలోపేతం చేయాలని జిల్లా పోలీసులకు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశించారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో కర్నూలు పోలీసులు విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా పోలీసు అధికారులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. అనుమానితులను విచారించారు. వాహనాల తనిఖీలు చేపట్టి రోడ్డు భద్రతపై అవగాహన చేశారు. ద్విచక్రవాహనం నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు.

ఆ పాఠశాలల సమయంలో స్వల్ప మార్పులు

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: పదో తరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రాలో పాఠశాలల సమయంలో స్వల్ప మార్పులు చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.సామెల్ పాల్ తెలిపారు. డైరెక్టర్ పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు పాఠశాలలో మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పాఠశాలలు నిర్వహించాలని వారు సూచించారు. జిల్లాలోని విద్యాశాఖ అధికా రులు, మండల విద్యాధికారులు తమ పరిధిలోని పదో తరగతి పబ్లిక్ పరీక్షలు కేంద్రాల గల పాఠశాలలుపై సూచించిన సమయపాలన పాటించేటట్లు తగు చర్యలు తీసుకోవాలని వారు తెలిపారు.

మండుతున్న ఎండలు

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: మార్చి 18కే ఎండటు మండుతున్నాయి. ఉగాది పండుగ వెళ్ళక ముందే ఎండలు మండుతున్నాయి. గత మూడు రోజుల నుండి జిల్లాలో ఉదయం 11 గంటల నుండే ఎండ తీవ్రత పెరిగింది. దీంతో మధ్యహ్నం 1గం ప్రాంతానికే ప్రజలు రోడ్డు మీదకు రావాలంటే భయపడుతున్నారు. ఎండ వేడిమికి తట్టుకోలేక ప్రజలు శీతల పానియాలను ఆశ్రయిస్తున్నారు. కొబ్బరి బోండాలు, పుచ్చకాయలు, కుల్‌డ్రింక్స్, చెరుకురసం, నన్నారి, జ్యూస్‌లు, లస్సీలను ఆశ్రయి స్తున్నారు. మార్చి నెల మధ్యలోనే ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలలో ఎలా ఉంటాయో భయమేస్తుందని ప్రజలు అంటున్నారు. వృద్దులు, పిల్లలు పరిస్థితి ఏమిటని భయాందోళనకు గురవుతున్నారు. ఈ ఏడాది అధిక వేడి ఉంటుందని, ఎండలు ఎక్కువగానే ఉంటాయని, వడగాలులు అధికంగా ఉంటాయని వాతా వరణ శాఖ అధికారులు చెపుతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

నీళ్లు తాగేందుకు వెళ్లి మహిళా గల్లంతు

విశాలాంధ్ర - హొళగుంద: ఆలూరు మండలం మొలగవల్లి గ్రామానికి చెందిన మహిళ శ్రీదేవి (46)నీళ్లు తాగేందుకు కాలువలోకి దిగి, కాలు జారడంతో మహిళ గల్లంతైన ఘటన మంగళవారం హాలహర్వి మండలం ఎల్ఎల్సీ కాలువ బాపురం-పచ్చరపల్లి గ్రామ చివరలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరుకు, మిరప కోత పనులు ముగించుకొని ఇంటికి వెళ్లే సమయంలో నీళ్లు తాగేందుకు కాల్వలో దిగింది. ప్రమాదవశాత్తు కాలుజారి కాలువలో పడి గల్లాతైంది. ఆమె ఆచూకీ కోసం స్థానికులు గాలిస్తున్నారు. శ్రీదేవికి భర్త భగీరథ నలుగురు సంతానం, ఇద్దరు కుమారులు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమార్తెకు పెళ్లయింది.

పంట నష్ట పరిహారం ఖాతాల్లో జమ చేయాలి

విశాలాంధ్ర-పత్తికొండ: పంట నష్టపరిహారం రైతుల ఖాతాలలో పూర్తిగా జమ చేయాలని ఏపీ రైతు సంఘం నియోజకవర్గ గౌరవ అధ్యక్షులు ఎం.కారన్న, సీపీఐ జిల్లా సమితి సభ్యులు పెద్ద ఈరన్న డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని దూదేకొండ గ్రామంలో రైతులను కలుసుకొని ఏపీ రైతు సంఘం సభ్యత్వాలను చేర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అరకొరగా రైతుల ఖాతాలలో జమ చేసిందని, నష్ట పోయిన రైతులందరికీ పూర్తిగా పంట నష్ట పరిహారాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులు ఎదుర్కొంటున్న సమ స్యలపై ఏపీ రైతు సంఘం చేపట్టబోయే ఉద్యమాలలో రైతులు భాగస్వామ్యం కావాలన్నారు.

పార్కు స్థలాల్లో హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : నగరంలో కమిషనర్ ఆదేశాల మేరకు పార్కు స్థలాలకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్లు నగరపాలక సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్ వెల్లడించారు. మంగళవారం నాల్గవ తరగతి ఉద్యోగుల కాలనీలో ఎల్పీ నెంబర్ 116/89 నందు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు సిటి ప్లానర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్కు స్థలాలను ఎవరైనా అన్యాక్రాంతం చేయాలని చూస్తే, చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సబ్సిడీపై ట్రాక్టర్‌ల యాంత్రీకరణ పనిముట్లు

విశాలాంధ్ర - సి.బెళగల్: 40శాతం సబ్సిడీపై ట్రాక్టర్లకు సంబంధించిన యాంత్రికరణ పనిముట్లను ఇవ్వనున్నట్లు మండల వ్యవసాయ అధికారి మల్లేష్ కుమార్ తెలిపారు. మంగళవారం మండల వ్యవసాయ కార్యాలయం నందు పొలం పిలుస్తుంది అనే కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లు గురించి వివరించారు. ప్రస్తుతము ట్రాక్టర్లకు సంబంధించిన వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లు ప్రభుత్వము 40 నుంచి 50 శాతం సబ్సిడీతో రైతులకు అందిస్తున్నట్లు వ్యవసాయ అధికారి తెలియజేశారు. ట్రాక్టర్‌లకు సంబంధించిన పనిముట్లు మడకలు, నాగళ్ళు గుంటిక వంటి పరికరాలు మరియు తైవాన్ స్ప్రేయర్లు, బ్యాటరీ స్ప్రేయర్స్ సబ్సిడీ రూపంలో ఇస్తుందని తెలిపారు. ఎవరైనా రైతులు తమరికి కావాల్సిన వారు తమ గ్రామంలోని రైతు సేవా కేంద్ర ఇన్చార్జిని సంప్రదించి రిజిస్ట్రేషన్చేసుకోవాల్సిందిగా వ్యవసాయ అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది వీహెచ్ఏ శశిదేవి, ఎంపీఈఓ సునంద రైతులు తదితరులు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించకపోతే దుకాణాలు సీజ్

- గృహాలకు తాగునీటి కొళాయి కనెక్షన్లు కట్
- వందశాతం పన్నులు వసూలుకు యాక్షన్ ప్లాన్
- నగరపాలక అదనపు కమిషనర్ ఆర్జీవీ కృష్ణ వెల్లడి
- శ్రీచక్ర హాస్పిటల్లో బ్యానర్లు, ప్లకార్డులతో నిరసన

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : నగరపాలక సంస్థకు సంబంధించి ఆస్తి పన్ను, కొళాయి చార్జీలు, ట్రేడ్ లైసెన్స్ రుసుములను త్వరితగతిన చెల్లించకపోతే వాణిజ్య సముదాయాల దుకాణాలను సీజ్ చేస్తామని, గృహాలకు తాగునీటి కొళాయి కనెక్షన్లను కట్ చేస్తామని, నగరపాలక అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ, గృహ, వాణిజ్య దుకాణాల యజమానులను హెచ్చరించారు. చెన్నమ్మ సర్కిల్ సమీపంలోని శ్రీ చక్ర హాస్పిటల్, నగరపాలకకు రూ.6.58 లక్షలు ఆస్తి పన్ను బకాయిలు చెల్లించేందుకు జాప్యం చేస్తుండటంతో, మంగళవారం అదనపు కమిషనర్ అధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది ఆసుపత్రిలో బ్యానర్లు ప్లకార్డులతో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ఆస్తి, వ్యాపార వాణిజ్య దుకాణాలు, సముదాయాలు కలిగిన ప్రతి పౌరుడు నగరపాలకకు సకాలంలో బాధ్యతాయుతంగా పన్నులు చెల్లించాలని, ఇందులో నిర్లక్ష్యం ప్రదర్శించడం తగదన్నారు. స్థానిక ప్రభుత్వం నగరపాలకకు పన్నుల రూపంలో వచ్చిన నిధులతోనే నగరంలో మౌలిక వసతులను కల్పించడం సాధ్యం అవుతుందన్నారు. బకాయిదారులు పన్నులు త్వరితగతిన చెల్లించకపోతే, ఏ నోటీసు జారీ చేయకుండా దుకాణాలను సీజ్ చేస్తామని, గృహాలకు మంచినీటి కుళాయి కనెక్షన్లను తొలగిస్తామని స్పష్టం చేశారు. ఆస్తి పన్ను, తాగునీటి కొళాయి చార్జీల బకాయి దారులు, వాణిజ్య సముదాయ దుకాణ యజమానులు ట్రేడ్ లైసెన్స్ రుసుమును వెంటనే చెల్లించ వలసిందిగా సూచించారు. మొండి బకాయి లపై కఠినంగా వ్యవహరిస్తున్నామని, పన్నులను వందశాతం వసూలుకు యాక్షన్ ప్లాన్ రూపొందించామన్నారు. నగర ప్రజలు పన్ను లను జాప్యం చేయకుండా, సత్వరమే పన్నులను చెల్లించి నగరాభివృద్ధికి తోడ్పాటు అందించాలని అదనపు కమిషనర్ కోరారు. కార్యక్రమంలో ఆర్ఓ జునైద్, రెవెన్యూ ఇంస్పెక్టర్లు జీఎం శ్రీకాంత్, సచివాలయ అడ్మిన్లు పాల్గొన్నారు.

ఆహార నాణ్యత ప్రమాణాలపై కమిషనర్ ఆరా

విశాలాంధ్ర - కర్నూలు సిటీ: నగరం లోని అన్న క్యాంటీన్లలో ఆహార నాణ్యత ప్రమాణాలపై నగరపాలక కమిషనర్ ఎస్. రవీంద్ర బాబు ప్రజలను ఆరా తీశారు. మంగళవారం కలెక్టరేట్, పాతబస్తీలోని అన్న క్యాంటీన్లను కమిషనర్ ఆకస్మిక తనిఖీ చేశారు. అల్పాహారం చేయడానికి వచ్చిన ప్రజలను కమిషనర్ అప్యాయంగా పలకరించి, అల్పాహార రుచిని అడిగి తెలుసుకున్నారు. క్యాంటీన్ల వద్ద భోజన సమయం కన్నా ముందే స్వచ్ఛత పనులు చేపట్టాలని, ఆహార నాణ్యత విషయంలో రాజీ పడొద్దని నిర్వాహకులకు సూచించారు. తప్పనిసరిగా మెనూ పాటించాలని, సమయం ముగిసేవరకు సహకారం అందించాలని సూచించారు.

విద్యుత్ మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు: విద్యుత్ మీటర్ రీడర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనాన్ని అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప కోరారు. విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర సమితి పిలుపు మేరకు పట్టణంలో విద్యుత్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప, విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నరసింహారెడ్డి, డివిజన్ నాయకులు వీరేష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు వస్తే మీటర్ రీడర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీ ఇవ్వడం జరిగిందన్నారు. అధికారంలోకి వచ్చి పది నెలలు కావస్తున్నా మీటర్ రీడర్లకు ప్రత్యన్న ఉపాధి చూపించడంలో కూటమి ప్రభుత్వం పూర్తి వైఫల్యం చెందిందన్నారు. తక్షణమే విద్యుత్ మీటర్ రీడర్స్‌కు ఎన్నికల ముందు ఇచ్చినట్టు వాగ్దానం ప్రకారంగా వారికి ప్రత్యామ్నాయం చూపించి, ఎస్కో అకౌంట్ ద్వారా ప్రతినెల వేతనాలు చెల్లించాలని వాళ్ళు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ విద్యుత్ మీటర్ల రీడింగ్ యూనియన్ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు వీరేష్, వీర శేఖర్, ఉరుకుందు, ఏఐటీయూసీ తాలూకా కార్య దర్శి తిమ్మగురుడు, పట్టణ కార్యదర్శి విజేంద్ర, కుమార్ స్వామి, నరసప్ప, చంద్రశేఖర్, నరసిం హులు, జోష్ రాజ్, ఉప్పర ఉరుకుందు, కిరణ్ కుమార్, రంగన్న, మునిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాలను పునఃప్రారంభించాలి : ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర - కోడుమూరు: బీసీ బాలుర వసతి గృహాలను పునఃప్రారంభించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు డి.సొమ్మన్న, జిల్లా సహాయ కార్యదర్శి బి.రంగస్వామిలు కోరారు. మంగళవారం పట్టణంలోని స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ కోడుమూరు మండల సమితి ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిలుగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు డి.సొమ్మన్న, జిల్లా సహాయ కార్యదర్శి బి.రంగస్వామిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని సాంఘిక సంక్షేమ, బీసీ, బాలుర వసతి గృహాలను పున:ప్రారంభించాలని కోరారు. కళాశాల మేనేజ్మెంట్ హాస్టల్ మండలంలోని వర్కూరు గ్రామంలో అద్దె భవనంలో నడుతున్నారని, తక్షణమే నూతన భవనాన్ని నిర్మించాలని వారు కూటమి ప్రభుత్వన్ని డిమాండ్ చేశారు. మండలంలోని ఏపీ మోడల్ పాఠశాలకు ప్రధాన రహదారి గుంతలమయంగా మారిందని, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణమే నూతన రహదారిని నిర్మించాలన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు ఇంటర్ పూర్తి చేసుకొని పై చదువుల కొరకు తీవ్రఇబ్బందులు పడుతూ కర్నూలు, హైదరాబాద్, నంద్యాల, బెంగుళూరులకు వెళ్లి చదువుకుంటున్నారని చెప్పారు. విద్యార్థులకు ఉపయోగపడే ప్రభుత్వ డిగ్రీ కళాశాలనునియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసి విద్యార్థుల కళను నెరవేర్చలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మార్చి 23న భారతదేశ స్వాతంత్ర సమయోధులు సర్దార్ భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 94వ వర్ధంతిని విద్యకాషాయికరణ, మతోన్మాద రాజకీ యానికి వ్యతిరేకంగా వినూత్న రీతిలో కార్యక్రమం నిర్వహించాలని విద్యార్థి యువతకు పిలుపునిచ్చారు. మండల అధ్యక్షులు వీరేంద్ర, మండల ఉపాధ్య క్షులు మునిస్వామి, మండల నాయకులు సిద్ధు, కిషోర్, తరుణ్ సాయి, మల్లి పాల్గొన్నారు.

రీసర్వేను తప్పలు లేకుండా చేపట్టాలి

విశాలాంధ్ర - హొళగుంద: రీసర్వేను తప్పులు లేకుండా చేపట్టాలని సబ్ కలెక్టర్ మంత్రి మౌర్య భారద్వాజ్ రెవెన్యూ సిబ్బందికి ఆదేశించారు. రీ సర్వే ప్రాజెక్టు గ్రామమైన పెద్ద హ్యాటలో జరుగుతున్న ఈ సర్వే పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సర్వీస్ శాతం పనితీరు గురించి అధికారులతో అడిగి తెలుసుకున్నారు. రీసర్వేను వేగవంతం చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా, ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని కోరారు. నేరణికిలో వివాదాస్పదంగా ఉన్న స్థలాన్ని పరిశీలించారు. సబ్ కలెక్టర్ వెంట తహశీల్దార్ నిజాముద్దీన్, డివిజన్ ల్యాండ్ సర్వేయర్ వేణు సూర్య, రీసర్వే డీటీ ముకుందరావు, వీఆర్వో ప్రహల్లాద, సర్వేయర్ శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్ రీడర్ల సమస్యలు పరిష్కరించండి

విశాలాంధ్ర - ఆదోని క్రైం: విద్యుత్ మీటర్ రీడర్స్ సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్ బాబు అన్నారు. మంగళవారం విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. మీటర్ రీడర్స్ సమస్యలపై డీఈ హరికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటబృతం గత ప్రభుత్వం అమలు చేస్తున్న స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిందని అధికారంలోకి వచ్చిన తర్వాత అదేవిధంగా కొనసాగిస్తూ వేలాదిమంది కార్మికులు కడుపు కొట్టే విధానాలను మానుకోవాలని హెచ్చరించారు. మీటర్ రీడర్స్ కార్మికులకు ఉపాధి కల్పించి, కనీస వేతనాలు అమలు చేసి కార్మికులను పర్మిట్ చేయాలని డిమాండ్ చేశారు. సబ్ స్టేషన్ లో ఐటిఐ ఉన్న వారిని ఆపరేటర్లుగా, అవసరతను బట్టి ఉద్యోగాలను నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు భీమ్ వెంకన్న కలుభవి రాజు దశరథ్, ఏపీ విఎంఆర్ కార్యదర్శి వెంకటేష్, ఫిరోజ్ సుధాకర్, రామంజి, నవీన్, విజయ్, మహేష్, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బపై అవగాహన

విశాలాంధ్ర - కర్నూలు వైద్యశాల : నగరంలోని కోటగిరి అప్పల ప్రైమరీ హెల్త్ సెంటర్లో మంగళవారం ఉదయం వడదెబ్బపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డెమో శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజలు ఉదయం 11 గంటలలోపు పనులు ముగించుకొని నీడగల ప్రదేశాలలో ఉండాలని, తప్పని సరిగా బయట ఎండలో వెళ్ళివలసినచో గొడుగు, టోపీ, లేదా తలపై టవల్ పెట్టుకుని, కాళ్ళకు చెప్పులు ధరించి వెళ్లాలని, వెంట నీళ్ల బాటిల్ తీసుకుని గంట గంటకు నీళ్లు తాగాలని, లేనిచో శరీరంలోని నీరు, లవణాలు చెమట రూపంలో ఆవిరి అయిపోయి శరీరం నీరసంతో వడబ్బకు గురవుతారని తెలిపారు. ఓఆర్ఎస్ పాకెట్లు అన్ని సచివాలయాలు, హెల్త్ అండ్ వేల్నేస్స్ సెంటర్స్, ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలలో అందుబాటులో ఉంటాయని తెలిపారు. బయట అమ్మే కూల్ డ్రింక్స్, జంక్ ఫుడ్స్ తినరాదన్నారు. చిన్నారులు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, వృద్ధులు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్త వహించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం నందు డిప్యూటీ డెమో చంద్రసేకర రెడ్డి, ఆరోగ్య కార్యకర్త పద్మావతి, ఆశా కార్యకర్తలు ఆషియా, సైనాజ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జైలు, మహిళా జైలు తనిఖీ

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు జి.కబర్ధి, కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి కర్నూల్ పురుషుల కేంద్ర కారాగారం మహిళ కారాగారామును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి జైలు ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను తనిఖీ చేసి జైలు ఖైదీలకు ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్స్ గురించి వివరించారు. ఇందులో ఓ అడ్వకేట్, ఒక ప్యారా లీగల్ వలంటీర్ ఉంటారని, వారు ఖైదీలకు న్యాయ సహాయాలు అందిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా జైలులో ఉన్న ఖైదీలు సత్ప్రవర్తనతో శిక్షను పూర్తి చేయాలని కోరారు. ఖైదిలకు ఎవరికైనా న్యాయవాదులు లేకుంటే ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామని తెలిపారు. ఖైదిలకు అందించే ఆహారాన్ని, రేషన్‌ను వారి ఆరోగ్యం గురించి తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జైలు అధికారులు, లాయర్ శివరాం, ఖైదీలు పాల్గొన్నారు.

నీటి వనరులపై శిక్షణా

విశాలాంధ్ర - పెద్దకడబూరు : స్థానిక మండల తహశీల్దార్ కార్యాలయం నందు తహశీల్దార్ గీతా ప్రియదర్శిని ఆధ్వర్యంలో 7వ చిన్న తరహా నీటి వనరులు, రెండవ జలాశయంల గణనపై మంగళవారం గ్రామ రెవెన్యూ అధికారులకు, సహాయకులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ గీతా ప్రియదర్శిని, మండల సహాయ గణాంక అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ శిక్షణా కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం సహకారంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలో బోర్లు, బావులు, కుంటలు, చెరువులు, వంకలు, వాగుల ద్వారా మొత్తం ఎన్ని ఎకరాల భూ విస్తీర్ణం లో సాగవుతున్నదో మొబైల్ యాప్ ద్వారా ఏ విధంగా వివరాలను సేకరించాలో సలహాలు, సూచనలు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జెర్మియా, డిప్యూటీ తహశీల్దార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి కోసం ఆందోళన

విశాలాంధ్ర - మంత్రాలయం: మండలంలోని కళ్ళుదేవ కుంట గ్రామంలో తాగినీటి కోసం రహదారిపై గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. గత 20 రోజుల నుంచి గ్రామంలో నీటి కొరత తీవ్ర కొరత ఉండడంతో మహిళలు కాళీబిందులతో జాతీయ రహదారిపై రోడ్డు దిగ్బంధం చేశారు సుమారు.మూడు కిలోమీటర్ల వరకు బస్సులు, కారులు నిలిచిపోవడంతో మంత్రాలయానికొచ్చే భక్తులు, స్కూళ్లకు వెళ్లే విద్యార్థులకు తీవ్రంగా ఇబ్బంది ఏర్పడింది. సమాచారం అందుకున్న ఎస్సై శివాంజల్ కళ్ళ దేవకుంట గ్రామ ప్రజలు, మహిళలతో మాట్లాడి ఉన్నత అధికారులకు సమాచారం అందజేసి అధికారులను అక్కడికే రప్పించి గ్రామస్తులకు నీటి కొరత లేకుండా ఉండేందుకు చర్యలు తీసుకొని, నీటి సదుపాయాన్ని కల్పిస్తామని హామీ ఇవ్వడంతో కళ్ళదేవకుండా గ్రామ ప్రజలు ధర్నాను విరమించుకున్నారు.

వైఎస్సార్ విగ్రహానికి నిప్ప పెట్టిన దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - కోడుమూరు : పట్టణ శివారులోని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పెట్రోల్ పోసి నిప్పు పెట్టిన దుండగులపై కేసులు పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని కోడుమూరు వైసీపీ మండల కన్వీనర్ రమేష్ నాయుడు కోరారు. కర్నూలు రహదారిలోని కోడుమూరు పట్టణ శివారులోని మొండికట్ట వాగు హంద్రీ బ్రిడ్జి వద్ద ఉన్న దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి కాంస్య విగ్రహానికి దుండగులు బట్టలు వేసి, పెట్రోల్ పోసి నిప్పు పెట్టి దుశ్చర్యలకు పాల్పడిన సంఘటన మంగళవారం జరిగింది. విగ్రహానికి నిప్పు పెట్టిన విషయం తెలుసుకున్న కోడుమూరు వైసీపీ మండల కన్వీనర్ రమేష్ నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వైఎస్ఆర్ విగ్రహం వద్దకు చేరుకొని దగ్ధమైన వైఎస్సార్ విగ్రహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రమేష్ నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వైసిపి నాయకులు, కార్యకర్తలపై దాడులు చేస్తూ, వారి పైనే అక్రమ కేసులు బనాయించి రెడ్ బుక్ పాలన కొనసాగిస్తుందని విమర్శించారు. ఈ నేపథ్యంలోనే కొందరు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడినట్లు ఆయన ఆరోపించారు. వైఎస్ఆర్ విగ్రహానికి నిప్పు పెట్టిన దుండగులను గుర్తించి, పోలీస్ అధికారులు వారిపై క్రిమినల్ కేసులు పెట్టి కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైఎస్ఆర్ విగ్రహానికి నిప్పు పెట్టిన ఘటనపై పోలీసులు వెంటనే స్పందించి నిందితులపై కఠిన చర్యలు తీసుకోకపోతే, నియోజకవర్గ స్థాయి వైసిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్ చేరుకొని వైఎస్సార్ విగ్రహానికి నిపుపెట్టిన ఘటనపై కోడుమూరు ఎస్సై ఏపీ శ్రీనివాసులుకు ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ మాజీ కన్వీనర్ కృష్ణా రెడ్డి, సుబ్బారావు స్వామి, జగదీష్, వీరన్న, సురేష్, గోపి, బజారి, మద్దిలేటి పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

అవినీతికి పాల్పడితే కక్కిస్తాం

సుస్థిర దిగుబడుల సాధనకు ప్రకృతి వ్యవసాయం

విశాలాంధ్ర - రుద్రవరం : వ్యవసాయంలో రైతులు సుస్థిర దిగుబడులను సాధించేందుకు ప్రకృతి వ్యవసాయం ఎంతో దోహదపడుతుందని జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని తిమ్మనపల్లి హరినగరం గ్రామాలలో కులం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ వ్యవసాయంలో రైతులు రసాయనిక ఎరువుల వాడకండి తగ్గించుకోవాలన్నారు. పంటల ఎదుగుదలకు అధికారుల సూచనలను తప్పకుండా పాటించి సేంద్రియ ఎరువులను వాడాలని అన్నారు. సొంత భూమి కలిగిన ప్రతి రైతు విశిష్ట గుర్తింపు నెంబర్ కొరకు రైతు సేవ కేంద్రాలకు వెళ్లి నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారి నరేంద్రా రెడ్డి మాట్లాడుతూ వ్యవసా యంలో సుస్థిర దిగుబడులు సాధిం చుటకు గాను ప్రకృతి వ్యవసాయమే మార్గం అని సూచించారు. నేల ఆరోగ్యంతో పాటు పంటల ఆరోగ్యం ప్రజల ఆరోగ్యం కాపాడుకునేందుకు ప్రకృతి వ్యవసాయం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు, ప్రతి రైతు తనకున్న పొలంలో కొంత భాగమైన ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు పండించుటకు ముందుకు రావాలని తెలిపారు ఉత్సాహవంతమైన వారికి తగిన శిక్షణ ఇస్తామని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ రామ్మోహన్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి సుమతి, విస్తరణ అధికారి రాజు, సిబ్బంది ఫహీమా తబస్సుమ్, రైతు సేవ కేంద్రాల సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

▶ఉపాధి హామీలో జరిగిన అవినీతిపై సామాజిక తనిఖీ బృందం ఉక్కుపాదం ▶రూ.3,17,607 అవినీతి సొమ్ము రికవరీకి ఆదేశం ▶రూ.93 వేలు జరిమానా విధించిన పీడీ

విశాలాంధ్ర - పెద్దకడబూరు : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేద గ్రామీణ కూలీల నిమిత్తం అమలవుతుందని, అవినీతి, అక్రమాలు చేయడానికి కాదని డ్వామా పీడీ వెంకట రమణయ్య ఉపాధి సిబ్బందిని హెచ్చరించారు. మంగళవారం పెద్దకడబూరులోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో నాగరాజు స్వామి ఆధ్వర్యంలో ఏపీడీ లోకేశ్వర్ అధ్యక్షత సామాజిక తనిఖీ బహిరంగ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పనులను బినామీలు లేకుండా ఖచ్చితమైన కొలతలతో పని చేయిస్తే నిజమైన కూలీకి మంచి వేతనం లభిస్తుందని, ఈ దిశగా ఉపాధి సిబ్బంది పని చేయాలని సూచించారు. ఉపాధిలో జరిగిన అవినీతి సొమ్ము రూ. 3,17,607 తక్షణమే రికవరీ చేయాలని లేకపోతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే జరిమానా రూపంలో విధించిన రూ. 93 వేలు చెల్లించాలని ఆదేశించారు. పెద్దకడబూరు మండలంలోని వివిధ గ్రామాలలో ఏప్రిల్ 1, 2023 నుండి మార్చి 31, 2024 వరకు 717 పనులకు రూ. 29.40 కోట్ల పనులు ఉపాధి, పీఆర్, ఆర్ డబ్ల్యుఎస్, ఎస్ఎస్ఏలకు సంబంధించిన పనులు చేపట్టారు. వీటిపై ఈ నెల 1 నుండి 17 వరకు ఎస్ఆర్పీ విజయ భాస్కర్ ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ బృందాలు తనిఖీలు నిర్వహించారు. సామాజిక తనిఖీ బృందాలు గుర్తించిన అవినీతి, అక్రమాలను డ్వామా పీడీ వెంకట రమణయ్య పంచాయతీల వారిగా వెల్లడించారు. చిన్నతుంబళంలో రికవరీ రూ. 19,751, జరిమానా రూ. 2 వేలు, గవిగట్టులో రికవరీ రూ. 3,448, జరిమానా రూ. 2 వేలు, బాపులదొడ్డిలో రికవరీ రూ. 79,593, జరిమానా రూ. 18 వేలు, గంగులపాడులో రికవరీ రూ. 4,840, హనుమాపురంలో రికవరీ రూ. 17,686, ముచ్చిగిరిలో రికవరీ రూ. 26,113, జరిమానా రూ. 8 వేలు, తారాపురంలో రికవరీ రూ. 1,21,696, జరిమానా రూ. 17 వేలు, జాలవాడిలో రికవరీ రూ. 4,338, జరిమానా రూ. 8 వేలు, హెచ్ మురవణిలో రికవరీ రూ. 29,852, జరిమానా రూ. 2 వేలు, చిన్నకడబూరులో జరిమానా రూ. 5 వేలుగా తెలింది. కల్లుకుంటలో రికవరీ రూ. 8,914, జరిమానా రూ. 3 వేలు, పీకలబెట్టలో రికవరీ రూ. 1356, జరిమానా వెయ్యి, బసలదొడ్డిలో జరిమానా రూ. 7 వేలు, కంబళదిన్నెలో జరిమానా రూ. 2 వేలు, పెద్దకడబూరులో జరిమానా వెయ్యి, నౌలేకల్‌లో జరిమానా రూ. 6 వేలు, దొడ్డిమేకలలో జరిమానా వెయ్యి, కంబదహాళ్ లో జరిమానా రూ. 9 వేలు, మేకడోణలో జరిమానా వెయ్యి చొప్పున విధించారు. ఉపాధి హామీ పథకంలో రూ. 3,17,607 అవినీతి సొమ్మును రికవరీ చేయాలని, రూ. 93 వేలు జరిమానా రూపంలో చెల్లించాలని పీడీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ పీడీ మాధవి లత, ఏపీవోలు చంద్రశేఖర్, రామన్న, ఈసీ ఖాదర్ బాష, టీఏలు, ఎఫ్ఏలు, డీఆర్పీలు, సామాజిక తనిఖీ బృందం పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు తొలి అడుగు చంద్రబాబుదే

విశాలాంధ్ర -ఎమ్మిగనూరు టౌన్: షెడ్యూల్డ్ కులాల ఉమ్మడి రిజర్వే షన్లలో ఏబీసీడీ వర్గీకరణను అమలు చేసి, 59 ఉప కులాలకు సామాజిక న్యాయం అందించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే దక్కుతుందని టీడీపీ నాయకులు కదిరికోట ఆదెన్న అన్నారు. అనంతరం ఎస్సీ వర్గీకరణ అమలుకు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా ఏకసభ్య కమిషన్ ప్రభుత్వానికి సమర్పించిన నివేదికను రాష్ట్ర మంత్రివర్గం సోమవారం ఆమోదించడంతో మంగళవారం పట్టణంలోని స్థానిక అంబేద్కర్ కూడలి వద్ద మహనీయులు బీఆర్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్ రామ్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుల చిత్రపటానికి టిడిపి నాయకులు కదిరికోట ఆదెన్న ఆధ్వర్యంలో మాదిగలు పాలాభిషేకం చేశారు. ముందుగా భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మిఠాయిలు పంచుకొని బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు రోజా ఆర్ట్స్ ఉసేని, ఎస్.సాల్మన్, వన్నెల మోష, జాలవాడి ఏసన్న, జగతాప్ జయపాల్, ఆటో చిన్న, టి.ఈరన్న, సురేష్, కె.సుధాకర్, జె.బాబు, ఎం.శాంతిరాజు, మారెప్ప పాల్గొన్నారు

ఎంబీబీఎస్ పుస్తకాలు బహుకరణ



విశాలాంధ్ర - బనగానపల్లె : బనగానపల్లె శాఖ గ్రంథాలయానికి విశ్రాంత ఉపాధ్యాయులు కె.సురేష్ కుమార్ రెడ్డి దాదాపు రూ.15 వేలు విలువ గల ఎంబీబీఎస్, మెడిసిన్ పీజీ సంబంధించిన పుస్తకములను అందించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి జలాల్ బషీర్ అహ్మద్ వారిని అభినందించారు. ఎవరైనా మెడిసిన్ చదివే విద్యార్థులు ఈ పుస్తకములను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

భారీ వాహనాలు దారి మళ్లింపు

విశాలాంధ్ర - బనగానపల్లె: టంగుటూరు గ్రామంలో దేవర సందర్భంగా భారీ వాహనాలు దారి మళ్లిస్తున్నట్లు నందివర్గం ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. నేడు టంగుటూరు గ్రామం నందు పెద్దమ్మ జాతర సందర్భంగా ఉదయం 6 నుండి సాయంత్రం 6 గంటల వరకు ట్రాఫిక్ డైవర్షన్ చేస్తున్నందున భారీ వాహనములు బనగానపల్లె నుండి నంద్యాలకు టంగుటూరు గ్రామం మీదుగా కాకుండా పాణ్యం వైపుగా, నంద్యాల నుండి బనగానపల్లెకు టంగుటూరు మీదుగా కాకుండా పాణ్యం వైపు నుండి బనగానపల్లెకు చేరుకోవాలని సూచించారు.

నిత్యావసర సరుకులు అందజేత

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: పాణ్యం మండలం బలపనూరు గ్రామానికి చెందిన మహబూబ్ బాషా గౌండ (కూలీ) పనులు చేస్తూ జీవనం సాగిస్తూ ఉండేవారు. ప్రమాదవశాత్తు కాలుకు గాయపడడంతో, షుగర్ కారణంగా రెండు కాళ్లు తీసేయాల్సిన పరిస్థితి వచ్చింది. ఆ కుటుంబానికి ఉన్న ఏకైక మగ దిక్కు మంచానికి పరిమితమవడంతో సోషల్ మీడియాలో దాతల సహాయం కోరారు. ఈ విషయం తెలుసుకున్న అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం బృందం బియ్యం, కొన్ని నిత్యావసర సరుకులను అందజేశారు. దయచేసి ప్రజలందరూ ఆ కుటుంబానికి సహాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో రాయలసీమ జోన్ ఇన్‌చార్జ్ డాక్టర్ ఎస్ఎండి ఫయాజ్, ఎస్.కె.సుబాన్, ఇలియాస్, అసిఫ్ బాష, ముషాహిద్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం ఆందోళన

విశాలాంధ్ర - మంత్రాలయం: మండలంలోని కళ్ళుదేవ కుంట గ్రామంలో తాగినీటి కోసం రహదారిపై గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. గత 20 రోజుల నుంచి గ్రామంలో నీటి కొరత తీవ్ర కొరత ఉండడంతో మహిళలు కాళీబిందులతో జాతీయ రహదారిపై రోడ్డు దిగ్బంధం చేశారు సుమారు మూడు కిలోమీటర్ల వరకు బస్సులు, కారులు నిలిచిపోవడంతో మంత్రాలయానికొచ్చే భక్తులు, స్కూళ్లకు వెళ్లే విద్యార్థులకు తీవ్రంగా ఇబ్బంది ఏర్పడింది. సమాచారం అందుకున్న ఎస్సై శివాంజల్ కళ్ళ దేవకుంట గ్రామ ప్రజలు, మహిళలతో మాట్లాడి ఉన్నత అధికారులకు సమాచారం అందజేసి అధికారులను అక్కడికే రప్పించి గ్రామస్తులకు నీటి కొరత లేకుండా ఉండేందుకు చర్యలు తీసుకొని, నీటి సదుపాయాన్ని కల్పిస్తామని హామీ ఇవ్వడంతో కళ్ళదేవ కుండా గ్రామ ప్రజలు ధర్నాను విరమించుకున్నారు.

గ్రామ ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు పదోన్నతి చానల్‌ను ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - పెద్దకడబూరు : గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తున్న గ్రామ ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు పదోన్నతి చానల్‌ను ఏర్పాటు చేయాలని మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏఈ మల్లయ్యకు సచివాలయ ఇంజనీర్స్ అసోసియేషన్ మండల కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సచివాలయ ఇంజనీర్స్ అసోసియేషన్ మండల కార్యదర్శి రంగన్న మాట్లాడుతూ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌కు ఒక ఇంజనీరింగ్ శాఖను కేటాయించి, పదోన్నతుల మార్గం సుగమం చేయాలన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 800 మందికి పైగా ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖలో పని చేస్తున్నారని, వీరందరూ గత ఐదున్నర ఏళ్ల నుండి వివిధ ఇంజనీరింగ్ శాఖలకు సంబంధించిన ప్రతిష్ఠాత్మకమైన పనులు అన్నింటిలోనూ ముఖ్యపాత్ర పోషించారని గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గ్రామ ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ఏదేని శాఖకు అనుసంధానం చేసి పదోన్నతి చానళ్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు జె.రాజు, ఉరుకుందు, భీమరాయుడు, శ్రావణి, మైత్రి, మాధవి లత, వంశీ, హర్ష, రాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో గంజాయి సాగును అరికట్టేలా చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: జిల్లాలో గంజాయి సాగు, మత్తు పదార్థాల సరఫరా, వినియోగాన్ని పూర్తిగా అరికట్టే విధంగా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నార్కోటిక్స్ కోఆర్డినేషన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగించాలని అధికారులను ఆదేశించారు. యూనివర్సిటీలు, మెడికల్ కళాశాలలు, ఇతర కళాశాలల్లో మత్తు పదార్థాల వినియోగం లేకుండా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. పొలాల్లో గంజాయి సాగు గురించి వ్యవసాయ శాఖ అధికారులతో పాటు వీఆర్వోల ద్వారా సమాచారం తీసుకుని పోలీసు శాఖకు అందించాలని ఆదోని సబ్ కలెక్టర్, ఆర్డీవోలను ఆదేశించారు. ఎక్సైజ్, అటవీ శాఖల అధికారులు గంజాయి సాగు, మత్తు పదార్థాల వినియోగం పట్ల నిఘా ఉంచాలని ప్రాంతాల్లో గంజాయి సాగుపై నిఘా ఉంచాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరం నుండి మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి పాఠశాలల్లో వ్యాస రచన, వక్తృత్వ పోటీలు, ర్యాలీలు, ప్రతిజ్ఞల ద్వారా విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని డీఈవోను ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, జిల్లా విద్యాశాఖాధికారి శామ్యూల్ పాల్, ఆర్టీసీ ఆర్ఎం శ్రీనివాసులు, అదనపు మున్సిపల్ కమీషనర్ ఆర్జీఎం కృష్ణ, ఎక్సైజ్ సూపరిన్టెండెంట్ సుధీర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పరికరాల కొరకు దరఖాస్తు చేసుకోండి

విశాలాంధ్ర-అవుకు : మండలంలోని రైతులు తమ వ్యవసాయ అవసరాలకు అవసరమయ్యే పరికరాల కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్ అన్నారు. మండలములోని నిచ్చేనమెట్ల గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమానికి మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ యాంత్రీకరణ లో భాగంగా రైతులకు ఆధునిక వ్యవసాయ పరికరాల కోసం రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుని రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని అన్నారు. అలాగే బ్యాటరీ స్ప్రేయర్లు, ఫుట్ స్ప్రేయర్లు, తైవాన్ స్ప్రేయర్లు, ట్రాక్టర్ దుక్కు, దమ్ము సెట్లు, రోటోవేటర్లు, పవర్ వీడర్లు, పవర్ టిల్లర్లను 50 శాతం సబ్సిడీతో అందించనున్నామని అన్నారు. 2024-25 సంవత్సరానికి గాను రైతులకు 50 శాతం సబ్సిడీపై వ్యవసాయ పరికరా లను సరఫరా చేసేందుకు నిధులు మంజూరైనట్లు, జిల్లా నుండి రైతు సేవ కేంద్రాల వరకు వ్యవసాయ పనిముట్లు టార్గెట్ ఇవ్వడమైనదని తెలిపారు. గత ఐదేళ్లుగా వ్యవసాయశాఖ నుంచి సబ్సిడీ ద్వారా పరికరాలు పొందని సన్న, చిన్నకారు రైతులు అర్హులన్నారు. ఏపీ అగ్రోస్ ద్వారా వివిధ కంపెనీల నుండి వ్యవసాయ యంత్రాలు పనిముట్లు రైతులకు సప్లై చేస్తున్నారు, ఆసక్తిగల రైతులు వినియోగించుకోవాలని, మరింత సమాచారం కొరకు స్థానిక రైతు సేవ కేంద్రం సిబ్బందిని సంప్రదించాలని అన్నారు.

మహానందిలో ఇద్దరు కూలీలు మృతి

విశాలాంధ్ర - మహానంది : మహానంది పుణ్యక్షేత్ర పరిధిలోని నాగనంది వసతి గృహాల కూల్చివేత పనులకు వచ్చిన ఇద్దరు కూలీలు మృతి చెందిన విషాద సంఘటన మంగళవారం సాయంత్రం జరిగింది. ఆలయ అభివృద్ధిలో భాగంగా దేవస్థానం నూతనంగా రూ.10 కోట్లతో నిర్మిస్తున్న వసతి గృహాల సముదాయముకు గత 30 ఏళ్ల కిందట నిర్మించిన వసతి గృహాల్లో కొంత భాగం అడ్డంకిగా మారింది. దీంతో దేవస్థానం టెండర్ ప్రక్రియను కర్నూలుకు చెందిన కాంట్రాక్టర్ నారాయణ రెడ్డికి రూ.4.20 లక్షలకు కూల్చివేత పనులను అప్పగించారు. గత పది రోజుల నుండి కాంట్రాక్ట్ ఎక్సకావేటర్ కూలీల సాయంతో కూల్చివేత పనులు జరుపుతున్నాడు. ఇందులో భాగంగా మంగళవారం నంద్యాల మండలం పెద్ద కోట్టల గ్రామానికి చెందిన కందికాయ పల్లె రాముడు (65), వడ్డే వెంకటేశ్వర్లు (50) కూలీలు వసతిగృహం కూల్చివేత పనులకు హాజరయ్యారు. కుల్చివేతలో మిగిలిన గృహంపై భాగంలో ఇద్దరు కూలీలు ఉండగా, ఇది గమనించిన మిగతా కూలీలు ప్రమాదం జరిగే అవకాశం ఉంది, కిందికి దిగి రావాలని కోరారు. విషయాన్ని గమనించే లోగానే ఇద్దరు కూలీలు కూర్చున్న పైభాగం ఎక్స్ కావేటర్ అదురుకుగురై కింద పడింది. ఈ సంఘటనలో రాముడు అక్కడికక్కడే మృతి చెందగా, గాయపడిన వడ్డే వెంకటేశ్వర్లు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని ఆలయ ఈవో నల్లకాల శ్రీని వాస్ రెడ్డి, ఏఈఓ మధు ఇంజనీరింగ్ అధికారి శ్రీని వాసులు చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. కేసీ కెనాల్ ప్రాజెక్ట్ అధ్య క్షుడు బన్నూరు రామలింగా రెడ్డి సంఘటన స్థలానికి చేరు కొని దిగ్భ్రాంతిని వ్యక్తం చేశా రు. మృతుల కుటుంబాలకు సాను భూతి తెలిపారు. ప్రభుత్వ పరంగా ఆర్థిక సాయం అందజేసి ఆదుకుంటామని హామీ ఇచ్చారు. మహానంది ఎస్సై రామ్మోహన్ రెడ్డి సిబ్బంది సహాయంతో ప్రమాదం జరిగిన ప్రదేశానికి చేరుకొని మిగతా కూలీ లను విచారించారు. పోస్టు మార్టం కొరకు రాముడు మృత దేహాన్ని నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుల కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మృత్తుల కుటుంబలను ఆదుకోవాలి

మహానంది క్షేత్రంలోని నాగనంది వసతి గృహాలు కూల్చే సమయంలో. ఇద్దరు మృతి చెందారు. పెద్దకోట్టాల గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికులు. రాముడు, వడ్డే వెంకటేశ్వర్లు మృతుల్లో రాముడుకి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని, వెంకటేశ్వర్లుకు ముగ్గురు కుమారులు ఉన్నట్లు తెలుస్తోంది. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 20.లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని సీపీఐ మండల కార్యదర్శి సామేలు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు

సరైన సమయానికి ఆరోగ్య సేవలందించండి

విశాలాంధ్ర - చాగలమర్రి: జాతీయ రహదారిపై ఏదైనా రహదారి ప్రమాదాలు జరిగినప్పుడు సరైన సమయానికి ఆరోగ్య, వైద్య సేవలు అందించాలని నేషనల్ హైవే పీడీ అశోక్ కుమార్ తెలిపారు. మంగళవారం చాగలమర్రి పట్టణ సమీపంలోని టోల్ ప్లాజా వద్ద ఎన్‌హెచ్ఏఐ, హెచ్ఎల్ఎల్ లైఫ్ కేర్ వారు సంయుక్తంగా టోల్‌ప్లాజా సిబ్బంది, ఇన్సిడెంట్ మేనేజ్‌మెంట్ సిబ్బందికి శిక్షణా తరగతులను మంగళవారం నిర్వహించారు ఈ శిక్షణా తరగతులను పిడి, హెచ్ఎల్ఎల్ స్టేట్ కోఆర్డినేటర్ మహేష్ కుమార్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ జాతీయ రహదారిపై వెళ్లే ప్రయాణికులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలు అందించాలన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు తక్షణ వైద్యం అందేలా చూడాలన్నారు. ప్రమాద స్థాయిని తగ్గించాలని తెలిపారు. కార్యక్రమంలో రాయలసీమ ఎక్స్ప్రెస్ హైవే ప్రాజెక్టు హెడ్ మదన్మోహన్, అరుణ్ రాజ్, సంతోష్, బాష, మనోహర్రెడ్డి పాల్గొన్నారు.

ఆయిల్ ఫామ్ సాగుపై రైతులకు అవగాహన

విశాలాంధ్ర - వెలుగోడు: ఆయిల్ ఫామ్ పంట సాగు రైతులకు లాభదాయకంగా ఉంటుందని వ్యవసాయ అధికారులు తెలిపారు. వెలుగోడు మండలంలోని అబ్దుల్లాపురం, గుంతకందాల గ్రామంలో మంగళవారం రైతులకు వివిధ రకాల పంటలపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం జొన్నలు మార్కెట్ ధర తక్కువ ఉండడంతో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరారు. ఏవో పవన్ మాట్లాడుతూ వ్యవసాయ పనిముట్ల కొరకు రైతు సేవ కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. వారితోపాటు ఏఈఓ సుధారాణి, అంజిత్ కుమార్ రెడ్డి, గ్రామ సర్పంచు భర్తలు రామకృష్ణారెడ్డి, శివయ్య, పతంజలి కంపినీ మేనేజర్ మహాదేవయ్య, రమణరెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ మౌనిక, రవళి, రైతు సేవ కేంద్రం సిబ్బంది రామలక్ష్మి అప్సర్ పాల్గొన్నారు.

మల్లికార్జున స్వామి భక్తులకు మజ్జిగ పంపిణి

విశాలాంధ్ర - హొళగుంద: శ్రీశైలం మల్లికార్జున స్వామి దర్శనం కోసం వెళ్లే కర్ణాటక భక్తులకు తోటద కుటుంబ సభ్యులు మజ్జిగ పంపిణీ చేశారు. పంపింగ ర్శనకి పాదయాత్రగా వెళ్తున్న కర్ణాటక భక్తులు మంగళవారం తోటద కుటుంబ సభ్యులు కలిసికట్టుగా ఎల్లార్తి రాస్తాలో మజ్జిగ వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో తోటద సిద్దప్ప, ఈరప్ప, రుద్రప్ప, సిద్దప్ప, గాదిలింగ, చిన్నప్ప, సుధాకర్, మంజు, మాట సుగురు వీరభద్రి, వీఆర్ఏ మల్లయ్య, భక్తులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్‌లకు దరఖాస్తు చేసుకోండి

విశాలాంధ్ర - సి.బెళగల్: మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని మహిళలు కుట్టు మిషన్ల కొరకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో రాణెమ్మ తెలిపారు. ఈ కుట్టు మిషన్లు దరఖాస్తుకు బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, క్షత్రియ, వైశ్య, బ్రాహ్మణ, కాపు మహిళలకు జిల్లా వెనుకబడిన తరగతుల సేవ సంఘం లిమిటెడ్ వారు 18 ఏళ్ల వయసు నుండి 50 ఏళ్ల వయసున్న మహిళలకు ఉచితంగా టైలరింగ్ ట్రైనింగ్ శిక్షణ ఇచ్చి కుట్టు మిషన్లు పంపిణీ చేస్తుందని ఎంపీడీవో తెలిపారు. ఆసక్తి గలవారు మీ గ్రామాల్లోని సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ దగ్గర ఆధార్ కార్డు, కుల ధ్రువపత్రం సర్టిఫికెట్, ఆదాయ ధ్రువ పత్రము సర్టిఫికెట్, రేషన్ కార్డు తదితర సర్టిఫికెట్లతో వెళ్లి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఆటో, మోటార్ సైకిల్ డీ

విశాలాంధ్ర - చాగలమర్రి: చాగలమర్రి నుండి నారాయణపల్లె రహదారిలో బుగ్గవంక సమీపంలో ఆటో, మోటార్ సైకిల్ డీ కొన్న సంఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. కడప జిల్లా నారాయణ పల్లెకు చెందిన నరసింహులు చాగలమర్రి నుండి నారాయణపల్లెకు మోటర్ సైకిల్‌పై వెళుతుండగా చాగలమర్రి వైపు వస్తున్న మినరల్ వాటర్ సరఫరా చేస్తున్న ఆటో బుగ్గ వంక సమీపంలో ఎదురుగా వస్తున్న మోటర్ సైకిల్‌ను డీ కొంది. ఈ ప్రమాదంలో నరసింహులు తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడ్డ నరసింహులును కేరళ వైద్యశాలకు తరలించారు. కాలుకు తీవ్ర గాయం కావడంతో మెరుగైన చికిత్సకై కడప వైద్యశాల కు తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు కేరళ వైద్యశాలకు చేరుకుని విచారణ చేపట్టారు.

ఆ పాఠశాలల సమయంలో స్వల్ప మార్పులు

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: పదో తరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రాలో పాఠశాలల సమయంలో స్వల్ప మార్పులు చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.సామెల్ పాల్ తెలిపారు. డైరెక్టర్ పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు పాఠశాలలో మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పాఠశాలలు నిర్వహించాలని వారు సూచించారు. జిల్లాలోని విద్యాశాఖ అధికా రులు, మండల విద్యాధికారులు తమ పరిధిలోని పదో తరగతి పబ్లిక్ పరీక్షలు కేంద్రాల గల పాఠశాలలుపై సూచించిన సమయపాలన పాటించే టట్లు తగు చర్యలు తీసుకోవాలని వారు తెలిపారు.

వడదెబ్బపై అవగాహన

విశాలాంధ్ర - కర్నూలు వైద్యశాల : నగరంలోని కోటగిరి అప్పల ప్రైమరీ హెల్త్ సెంటర్లో మంగళవారం ఉదయం వడదెబ్బపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డెమో శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజలు ఉదయం 11 గంటలలోపు పనులు ముగించుకొని నీడగల ప్రదేశాలలో ఉండాలని, తప్పని సరిగా బయట ఎండలో వెళ్ళవలసినచో గొడుగు, టోపీ, లేదా తలపై టవల్ పెట్టుకుని, కాళ్ళకు చెప్పులు ధరించి వెళ్లాలని, వెంట నీళ్ల బాటిల్ తీసుకుని గంట గంటకు నీళ్లు తాగాలని, లేనిచో శరీరంలోని నీరు, లవణాలు చెమట రూపంలో ఆవిరి అయిపోయి శరీరం నీరసంతో వడబ్బకు గురవుతారని తెలిపారు. ఓఆర్ఎస్ పాకెట్లు అన్ని సచివాలయాలు, హెల్త్ అండ్ వేల్నేస్ సెంటర్స్, ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలలో అందుబాటులో ఉంటాయని తెలిపారు. బయట అమ్మే కూల్ డ్రింక్స్, జంక్ ఫుడ్స్ తినరాదన్నారు. చిన్నారులు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, వృద్ధులు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్త వహించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం నందు డిప్యూటీ డెమో చంద్రసేకర రెడ్డి, ఆరోగ్య కార్యకర్త పద్మావతి, ఆశా కార్యకర్తలు ఆషియా, సైనాజ్ తదితరులు పాల్గొన్నారు.